సాక్షి
నిజామాబాద్

సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



రౌడీలకు ఇందూరు అడ్డా..
జిల్లా రౌడీలకు, భూకబ్జాదారులకు అడ్డాగా మారిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ ఆరోపించారు.
- 8లో ▸



మండపాలకు గణనాథులు
జిల్లావ్యాప్తంగా వినాయక విగ్రహాలు మండపాలకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మండపాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.5 /23.8

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండకాస్తుంది. సాయంత్రం మేఘావృతం కావచ్చు. చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

వినాయక చవితి శుభాకాంక్షలు




సుభాష్‌నగర్ : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లా ప్రజలకు ఆదివారం వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలు తొలగించే ఆది దేవుడైన వినాయకుని వేడుకలను ఎప్పటిలాగే సహృద్భావ వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు.

బాసర డీఐజీగా సత్యనారాయణ



ఖలీల్‌వాడి : రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ ఆదేశాల మేరకు ఆదివారం జోన్–2 బాసర పోలీస్ కార్యాలయంలో డీఐజీగా సీపీ సత్యనారాయణ అదనపు బాధ్యతలు స్వీకరించారు. సీపీ సత్యనారాయణకు జనవరి, 2024లో ఐజీగా ప్రమోషన్ రానున్నట్లు సమాచారం.కార్యక్రమంలో అదనపు డీసీపీ (లా అండ్ ఆర్డర్ జయరాం, అదనపు డీసీపీ (ఏఆర్) గిరిరాజు, ఏసీపీ కిరణ్ కుమార్, ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు, జోన్ – 2 బాసర పోలీస్ కార్యాలయం మేనేజర్ రాజప్రసాద్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

ఖిల్లా కోటపై ఎగిరిన జాతీయ జెండా



నిజామాబాద్ సిటీ : ఇతిహాస సంకలన సమితి ఆధ్వర్యంలో ఇందూరు చరిత్రకు మణిమకుటమైన ఖిల్లా కోటపై జాతీయ జెండా రెపరెపలాడింది. ఆదివారం తెలంగాణ విమోచన దినోత్సవ సందర్భంగా ఇతిహాస సంకలన సమితి ఆధ్వర్యంలో ఇతిహాస సంకలన సమితి సీనియర్ సభ్యుడు భోగరాజు వేణుగోపాల్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ ఖిల్లా కోట ఆకతాయిల అడ్డాగా మారిందని, శిథిలావస్థకు చేరిందని ఆవేదన చెందారు. ఖిల్లా కోటకు మరమ్మతులు చేపట్టాలన్నారు. దీనికిగాను ఇతిహాస సంకలన సమితి త్వరలోనే అందరినీ కలిసి కార్యాచరణ రూపొందించనుందన్నారు. ఇతిహాస సంకలన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కందకుర్తి ఆనంద్, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత దినోత్సవానికి గైర్హాజరు

సుభాష్‌నగర్ : నగరంలోని కలెక్టరేట్‌లో ఆదివారం ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవ కార్యక్రమానికి వివిధ శాఖల సిబ్బంది, జిల్లాస్థాయి అధికారులు గైర్హాజరయ్యారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించి, ప్రసంగించారు. ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టినప్పటికీ కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది పరిమిత సంఖ్యలో వచ్చారు. కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. అధికారులు, సిబ్బంది గైర్హాజరుపై మంత్రి ప్రశాంత్‌రెడ్డి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులే మేలు



సుభాష్‌నగర్ : పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులు మేలు చేస్తాయని మంత్రి ప్రశాంత్ రెడ్డి అన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ తరఫున ఆదివారం కలెక్టరేట్‌లో మంత్రి ప్రశాంత్ రెడ్డితోపాటు ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే బిగాలకు మట్టి గణపతులు అందజేశారు. రెవెన్యూ ఉద్యోగు ల సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమణ్ రెడ్డి, కార్యదర్శి ప్రశాంత్, టీఎన్‌జీవో అధ్యక్షుడు అలుక కిషన్, తహసీల్దార్ వేణుగోపాల్ ఉన్నారు.


తొలిపూజకు వేళాయే..



వినాయక్‌నగర్‌లో బ్యాండ్‌మేళాల మధ్య మండపానికి గణనాథుడిని తరలిస్తున్న భక్తులు

భక్తకోటి ఇష్టదైవం బొజ్జ గణపయ్య కొలువుదీరేందుకు సిద్ధమయ్యాడు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న నవరాత్రి ఉత్సవాల కోసం జిల్లా ప్రజలు సర్వం సిద్ధం చేశారు. ఈ ఏడాది పర్యావరణహిత మట్టి ప్రతిమలపై జిల్లా వాసులు మరింత ఆసక్తి చూపారు. గతేడాది కంటే ఈ ఏడాది మట్టిగణపతులపై అవగాహన పెరిగింది.

- నేడు కొలువుదీరనున్న గణనాథులు
- మట్టితో తయారుచేసిన వినాయకులకే అధిక ప్రాధాన్యం
- మండపాలు సిద్ధం చేసిన భక్తులు



నిజామాబాద్ సిటీ : జిల్లాలో వినాయక చవితి సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. వినాయక విగ్రహాలు, పూలు, పండ్లు, పూజా సామగ్రి తదితర వస్తువుల కొనుగోళ్లతో ఆదివారం మార్కెట్లు కళకళలాడాయి. ఇందులో భాగంగా జిల్లాలో పలు స్వచ్ఛంద సంస్థలు ఇప్పటికే వేలాది మట్టి గణపతి విగ్రహాలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు.

పోచమ్మగల్లీ గణపయ్య స్ఫూర్తితో..

జిల్లావాసులకు నగరంలోని పోచమ్మగల్లి రవితేజ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 58 ఫీట్ల ఎత్తుగల మట్టి గణపతి విగ్రహం నమూనా ఆదర్శంగా నిలుస్తుంది. పదేళ్లుగా సొసైటీ ఆధ్వర్యంలో మట్టితో గణపతి విగ్రహాన్ని తయారు చేయిస్తున్నారు. వీరి స్ఫూర్తితో మరింత మంది మట్టి గణపతులనే ప్రతిష్ఠించేందుకు ముందుకువస్తున్నారు. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 50 శాతం కంటే ఎక్కువ మంది మట్టి గణపతులనే ప్రతిష్ఠించి పూజించేందుకు ఆసక్తి చూపారు. నగరంలోని గాజుల్‌పేట్, దుబ్బా, ఎల్లమ్మగుట్ట, శివాజీనగర్, వినాయక్‌నగర్, జిల్లాలోని ఆర్మూర్, బోధన్ పట్టణాలతో పాటు వివిధ మండలాలలో మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారు.

సందడిగా మార్కెట్లు

వినాయక చవితి సందర్భంగా పూజ కోసం వినియోగించే 21 రకాల పత్రి, బంతిపూలు, మామిడి ఆకులు, మారేడు కాయల అమ్మకాలతో పలు ప్రాంతాల కూడళ్లు సందడిగా మారాయి. దాంతో పండ్లు, పూల వ్యాపారులు ఒక్కసారిగా రేట్లు పెంచేయటంతో ప్రజలు తప్పనిసరై కొనుగోలు చేశారు.

కోరికలు తీర్చే కర్ర విఘ్నేశ్వరుడు

- పాలాజ్‌లో మాదిరిగా డొంకేశ్వర్‌లో కర్రతో విగ్రహం
- ప్రతిఏటా ఘనంగా చవితి ఉత్సవాలు
- ఆరో వార్షికోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న సర్వ సమాజ్ కమిటీ



డొంకేశ్వర్‌లోని (కర్ర) సత్య గణపతి (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్) : వినాయక చవితి ఉత్సవాలకు పాలాజ్ గణపతి ఏ విధంగా ప్రసిద్ధి చెందిందో.. డొంకేశ్వర్‌లోని (కర్ర) సత్య గణపతి కూడా అదే విధంగా ప్రసిద్ధి చెందుతోంది. జిల్లాలో ఎక్కడ లేని విధంగా డొంకేశ్వర్‌లోనే కర్రతో తయారు చేసిన ఏకదంతుడు ప్రతీ ఏడాది విశేష పూజలందుకుంటున్నాడు. భక్తులు కోరిన కోర్కెలను తీర్చుతూ 'సత్య గణపతి'గా పిలవబడుతున్నాడు. దీనికి సంబంధించి 'సర్వ సమాజ్ కమిటీ' ఏర్పాట్లు చేస్తోంది. కర్ర గణపతి ఏర్పాటుపై వివరాల్లోకి వెళ్తే..

2018 నుంచి మొదలు..

మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న పాలాజ్ గణపతి చాలా ఫేమస్. వినాయక చవితి నవరాత్రుల్లో మాత్రమే గుడి తెరిచి ఉండే పాలాజ్ గణపతిని దర్శించుకోవడానికి ఎక్కడెక్కడి నుంచో భక్తులు వెళ్తుంటారు. అలాగే డొంకేశ్వర్ నుంచి కూడా ఎంతోమంది భక్తులు వెళ్లారు. పాలాజ్‌లో మాదిరిగా డొంకేశ్వర్‌లో కూడా కర్ర గణపతి ఏర్పాటు చేయాలనే ఆలోచన గోడిశరం నర్సారెడ్డికి వచ్చింది. వచ్చిన ఆలోచనను అందరితో పంచుకున్నాడు. అనుకున్నదే తడవుగా ఊరంతా కలిసి కార్యానికి శ్రీకారం చుట్టారు. గ్రామ జనాభా ఆధారంగా తలా రూ.10 చందా వేసి డబ్బులు పోగు చేశారు. వచ్చిన డబ్బులతో నిర్మల్ జిల్లా సిద్ధాపూర్‌లో జ్ఞానేశ్వర్ అనే కళాకారుడి వద్ద కర్ర గణపతిని తయారు చేయించారు. విగ్రహం తయారీలో మామిడి, తెల్ల జిల్లేడు, ఎర్రచందనం, రాగి చెక్కలను ఉపయోగించారు. అయితే, 2018 సెప్టెంబర్ 13 నుంచి డొంకేశ్వర్ మండల కేంద్రంలోని సత్య గంగవ్వ మండపంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఉత్సవాలను ప్రారంభించారు. ఐదో ఏడాది పూర్తి చేసుకోగా, ఆరవ వార్షికోత్సవ వేడుకలకు సిద్ధమవుతున్నారు.

పాలాజ్ గణపతిని చూసి..



ప్రతీ ఏడాది వినాయక చవితి సందర్భంగా పాలాజ్‌లోని కర్ర గణపతిని దర్శించుకుని 11రోజులు అక్కడే ఉండేవాడిని. పాలాజ్‌లో మాదిరిగా మా ఊళ్లో కూడా కర్రతో తయారు చేసిన విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఉత్సవాలను నిర్వహించాలని ఊరంతా అనుకున్నాం. అందరి సహకారంతో ప్రతీ ఏటా ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నాం. – గొడిశరం నర్సారెడ్డి, డొంకేశ్వర్

కోరిన కోర్కెలు తీరుతాయి



నిష్ఠతో గణపతిని పూజించి మనసులో ఏది కోరుకుంటే అది జరుగుతుందని భక్తుల్లో నమ్మకం ఏర్పడింది. అందుకే కర్ర గణపతికి సత్య గణపతి అనే పేరొచ్చింది. 11 రోజుల పాటు జరిగే ఉత్సవాల తో ఊరంతా పండుగ వాతావరణం నెలకొంటుంది. ఈ ఏడాది కూడా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని గణనాథుడి దీవెనలు పొందాలి. – సంజీవ్, డొంకేశ్వర్


వైశ్యరత్న గణేశ్‌కు వందేళ్లు

- దక్షిణ భారతదేశంలో మొదటి గణపతి ఇందూరులోనే..
- బ్రిటీష్, రజాకార్లను ఎదురించి మరీ ఉత్సవాలు
- బాలగంగాధర్ తిలక్ స్ఫూర్తితో వినాయకుడిని ప్రతిష్ఠించిన చందూర్ దమ్మయ్య గుప్తా
- అప్పట్లోనే అద్భుత రీతిలో నిమజ్జనానికి ఏర్పాట్లు

నిజామాబాద్ సిటీ : నిజాం బానిస సంకెళ్ల నుంచి హైదరాబాద్ సంస్థానానికి విముక్తి కలిగించేందుకు.. అందరికీ ఐక్యం చేసేందుకు అప్పట్లో ఏర్పాటు చేసిన గణేశ్ నవరాత్రుల కార్యక్రమం ఇప్పటికీ నిరాటంకంగానే కొనసాగుతోంది. 1893లో భారతదేశంలో జాతీయస్ఫూర్తిని రగిల్చేందుకు 'స్వరాజ్యం నా జన్మహక్కు, దానిని నేను పొంది తీరుతాను' అంటూ బొంబే స్టేట్ పూణేలో మొట్ట మొదటిసారిగా గణపతి ఉత్సవాలను పెద్దఎత్తున నిర్వహించారు బాలగంగాధర్ తిలక్. ఆయన స్ఫూర్తితో నిజామాబాద్ నగరం గాజుల్‌పేట్‌కు చెందిన స్వర్గీయ చందూర్ దమ్మయ్య గుప్తా 1923లో బ్రిటీష్ పాలకుల, రజాకార్ల అధిపత్యాన్ని ఎదురిస్తూ నిజామాబాద్‌లోని రాణాగల్లీలో గణపతిను స్థాపించి ఉత్సవాలను ఘనంగా నిర్వహించి చరిత్ర సృష్టించారు. ఆయన వేసిన తొలిఅడుగును అందిపుచ్చుకుని కొందరు ఇందూరు ఆర్యవైశ్యుల సహకారంతో వందేళ్లు పూర్తి చేసుకోవటం జిల్లాకే గర్వకారణంగా నిలుస్తోంది.

తాత అడుగుజాడల్లో మనమడు..

దమ్మయ్య నెలకొల్పిన గణపతి నవరాత్రుల ఉత్సవాలను ఆయన మనుమడు వైశ్యరత్న గణేశ్ మండలి అధ్యక్షుడు చందూరు దర్మేంధర్ గుప్తా ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్నేళ్లుగా ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహిస్తున్నారు.



రాణాగల్లీలోని వైశ్యరత్న గణేశ్ మండలిలో కొలువైన విఘ్నేశ్వరుడు (ఫైల్)

దక్షిణ భారతదేశంలోనే మొదటిది..

1923లో నగరంలో గణపతిను ఏర్పాటు చేయటం దక్షిణ భారతదేశంలోనే మొదటిది. 1893లో బాలగంగాధర్ పుణెలో ఏర్పాటు చేయగా, 1923లో రెండో గణపతిని చందూర్ దమ్మయ్య నిజామాబాద్ నగరంలో ఏర్పాటు చేశారు. ఇది దక్షిణ భారతదేశంలోనే మొదటిదయ్యింది. 1923 నుంచి 1960 వరకు దమ్మయ్య మరి కొందరు ఆర్యవైశ్యుల సహకారంతో వినాయక ఉత్సవాలను నిరాటంకంగా కొనసాగించారు. నాడు నిజాం ప్రభువుకు వ్యతిరేకంగా ఎవరైనా వెళ్తే వారిని గుర్రాలకు కట్టి ఈడ్చుకెళ్లేవారు. అయినా భయపడక దమ్మయ్య వినాయక ఉత్సవాలను నిర్వయించారు. ఈ ఏడాదితో ఆయన నెలకొల్పిన గణేశుడు 100 ఏళ్ల పూర్తిచేసుకుంటున్నాడు.



చందూరు దమ్మయ్య గుప్తా

చరిత్రలో నిలిచిపోయేలా..

మా వైశ్యరత్న గణేశ్ మండలి ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమాన్ని జిల్లా చరిత్రలోనే నిలిచిపోయేలా ఏర్పాట్లు చేస్తున్నాం. నిమజ్జనం రోజు పూణే బ్యాండ్‌తో పాటు లక్నో నుంచి అగోరా బ్యాండ్‌ను పిలుస్తున్నాం. పెద్దబజార్ వాటర్ ట్యాంక్ నుంచి పూలాంగ్ చౌరస్తా వరకు ఈ ఉత్సవం శోభాయమానంగా నిర్వహిస్తాం. ముంబయికి చెందిన కళాకారులతో కుమారస్వామి తారకాసురుడిను సంహరించే విధంగా ఈసారి మూమెంట్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నాం. 1923 నుంచి శతాబ్ది ఉత్సవాల వరకు ఉత్సవాలను 20 కార్యవర్గాలు నిర్వహించాయి. – చందూరు ధర్మేందర్ గుప్తా, చందూరు దమ్మయ్య గుప్తా మనుమడు



మూడింతల అభివృద్ధి చేస్తా..




భీమ్‌గల్ బస్‌డిపోను పునఃప్రారంభిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, పక్కన ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి

- మంత్రి ప్రశాంత్ రెడ్డి
- భీమ్‌గల్ బస్‌డిపో పునః ప్రారంభం

భీమ్‌గల్ : ప్రతిపక్షాలు ఎన్ని కుయుక్తులు పన్నినా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బాల్కొండను మూడింతలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని మంత్రి ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. భీమ్‌గల్‌లో ఆర్టీసీ బస్ డిపోను ఆదివారం ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు కాంగ్రెస్ హయాంలోనే డిపోను మూసివేసి ఇప్పుడు వారే మళ్లీ తెరిపించాలని గోల చేయడం సిగ్గుచేటన్నారు. చిన్న మున్సిపాలిటీ అయినప్పటికీ రాష్ట్రంలో ఎక్కడా లేనన్ని సీసీ రోడ్లు, డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్ వేయించానన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్, బీజేపీ నాయకులు విమర్శిస్తున్నారన్నారు. కేసీఆర్ కాలిగోటికి రేవంత్‌రెడ్డి సరిపోరన్నారు. మూతపడ్డ భీంగల్ బస్‌డిపోను 14ఏళ్ల తర్వాత ప్రారంభించుకున్నామని, ఆర్టీసీ ఇంజినీర్ల కష్టంతో రెండు నెలల్లోనే భీమ్‌గల్ బస్‌డిపోను పునఃప్రారంభించుకున్నామని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. ప్రస్తుతం భీమ్‌గల్ డిపోకు 22 బస్‌లను కేటాయించామని, భవిష్యత్తులో మరిన్ని కొత్త బస్సులను కేటాయిస్తామన్నారు. ప్రస్తుతం అన్ని డిపోలు దాదాపు లాభాలబాటలో ఉన్నాయన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కేసీఆర్ దేవుడయ్యాడన్నారు. కేసీఆర్‌తో సాన్నిహిత్యంతో నిధులు తీసుకొచ్చి మంత్రి ప్రశాంత్‌రెడ్డి బాల్కొండను అన్నివిధాలుగా అభివృద్ధి చేశారని బాజిరెడ్డి ప్రశంసించారు. ప్రతిపక్షాల మాటలను ప్రజలను నమ్మవద్దన్నారు.

మట్టి గణపతులనే పూజిద్దాం



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే బిగాల

నిజామాబాద్ నాగారం : ప్రతిఒక్కరూ మట్టి గణపతులను పూజించి, పర్యావరణాన్ని కాపాడాలని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా తెలిపారు. ఆదివారం నగరంలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యతలో భాగంగా ఎమ్మెల్సీ కవిత సహకారంతో జిల్లాలోని 108 వినాయక మండపాల నిర్వాహకులకు భారీ మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్సీ కవిత తన సొంత నిధులతో 108 భారీ మట్టి విగ్రహాలను అందజేశారన్నారు. మేయర్ దండు నీతూకిరణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాంకిషన్ రావు, భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు అవంతిరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

- యావత్ దేశానికే తెలంగాణ దిక్సూచి
- వ్యవసాయ రంగంలో మొదటిస్థానం
- 'గృహలక్ష్మి' కింద 16,500 ఇళ్లు మంజూరు
- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో ఘనంగా జాతీయ సమైక్యత దినోత్సవాలు
- స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ పురస్కారాల ప్రదానం



స్వచ్ఛతా హీ సేవా వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి



సుభాష్‌నగర్ : తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం స్ఫూర్తితో రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మన రాష్ట్రం యావత్ దేశానికే దిక్సూచిగా నిలవడం గర్వకారణమన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలను ఆదివారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.

అన్ని రంగాలకు వెన్నుదన్ను..

వ్యవసాయ రంగంలో దేశంలోనే ఉన్నత స్థానానికి చేరిందన్నారు. రుణమాఫీ కింద ఇప్పటివరకు 61, 353 మంది రైతులకు రూ. 281.02 కోట్లు మాఫీ అయ్యిందని తెలిపారు. రైతులకు సరిపడా ఎరువులు ఉన్నాయన్నారు. ఈ ఏడాదికిగాను 1,214 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటామన్నారు. జిల్లాలో 6 చేపల మార్కెట్లు మంజూరయ్యాయని, అర్సపల్లిలో రూ. 2 కోట్లతో హోల్‌సేల్, రిటైల్ చేపల మార్కెట్లకు శంకుస్థాపన చేశామన్నారు. ఈ ఏడాది 1,018 చెరువుల్లో 4.72 కోట్ల చేప పిల్లలు, 90.25 లక్షలు రొయ్య పిల్లలు వదిలేందుకు ఏ ర్పాట్లు చేశామన్నారు. రెండోవిడతలో 738 యూనిట్లు రూ.12.91కోట్ల వ్య యంతో గొర్రెలను పంపిణీ చేశామని, మిగిలిన వారికి పంపిణీ చేస్తామన్నారు. రేషన్‌షాప్‌ల ద్వారా ఫోర్టిఫైడ్ బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ సీజన్‌కు గాను గ్రేడ్–ఏ రకానికి క్వింటాలుకు రూ.2,203, కామన్ రకానికి రూ.2,183 కొనుగోలు చేయనున్నట్లు వివరించారు.

ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు..

ప్రభుత్వం పల్లె, పట్టణప్రగతి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని మంత్రి ప్రశాంత్‌రెడ్డి గుర్తుచేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఆంధ్రనగర్ ఉత్తమ జీపీగా ఎంపికైందన్నారు. ఈ–పంచాయతీ వెబ్‌సైట్ ద్వారా 3,153 భవనాలు, 2,569 వ్యాపార లైసెన్సులు, 31 లేఅవుట్లకు పంచాయతీలు అనుమతి ఇచ్చాయన్నారు. 391 మంది జేపీఎస్‌లకుగాను నాలుగేళ్ల పూర్తి చేసుకున్న 262 మంది అభ్యర్థులను రెగ్యులర్ చేశామన్నారు. నుడా ద్వారా రూ.2.94 కోట్లతో చిన్నాపూర్ అరణ్య అర్బన్ పార్కు, రూ. 87లక్షలతో కాలూర్ ట్యాంక్ బండ్, రూ.4.54 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జిల్లాకు గృహలక్ష్మి పథకం కింద రూ.16,500 ఇళ్లు మంజూరయ్యాయని, రూ. 3 లక్షల సబ్సిడీతో సొంత స్థలం కలిగిన అర్హులైన లబ్ధిదారులకు ఒక్కో నియోజకవర్గానికి 3 వేలు చొప్పున మంజూరు చేసిందన్నారు. 6,131 డబుల్ ఇళ్లు పూర్తయ్యాయన్నారు. విద్యాశాఖ ద్వారా ప్రతి 1,180 పాఠశాలల్లో 1,19,466 మందికి అల్పాహారం, మధ్యాహ్నభోజనం అందిస్తున్నామన్నారు. మన ఊరు–మన బడి కింద 407 పాఠశాలల్లో పనులు చేపడుతున్నారు.



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి ప్రశాంత్ రెడ్డి, పక్కన ఎమ్మెల్యేలు బిగాల, బాజిరెడ్డి, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ సత్యనారాయణ

అవార్డుల ప్రదానం

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ కింద ఎంపికైన 15 జీపీలకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి పురస్కారాలు ప్రదానం చేశారు. స్వచ్ఛతా హీ సేవా కరపత్రాలు ఆవిష్కరించారు. జెడ్పీ చైర్మన్ విఠల్ రావు, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, మేయర్ నీతూ కిరణ్, సీపీ సత్యనారాయణ, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వర్, మార్క్‌ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి, నుడా చైర్మన్ సంజీవ్‌రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ మోహన్, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

మండపాలకు గణనాథులు


తిరుమల గణేశ్ మండలి గణనాథుడు


చక్రాల సాయంతో రోడ్డుపైకి తీసుకొచ్చిన యువకులు

వినాయక చవితి సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాలు జనంతో రద్దీగా మారాయి. వినాయక ప్రతిమలను యూత్ సభ్యులు తమ మండపాలకు వాహనాల్లో తరలించారు. నగరంలోని వీక్లీ బజార్, పెద్ద బజార్, కంఠేశ్వర్, బైపాస్ ప్రాంతాలు జనంతో కిక్కిరిసిపోవడంతో కొంత మేర ట్రాఫిక్ జామ్ అయింది.
–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్


వినాయక ప్రతిమలు


వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌లో పెడుతున్న యూత్ సభ్యులు

మార్కెట్లో మొదలైన సందడి


పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్న భక్తులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో వినాయక చవితి సందడి మొదలైంది. పట్టణంలోని సుభాష్‌రోడ్, తిలక్‌రోడ్, మాయాబజార్‌లో సోమవారం నిర్వహించే వినాయక చవితి ఏర్పాట్లకు కావాల్సిన సామాగ్రితో ఆదివారం సందడిగా మారింది. ప్రజలు తమకు కావల్సిన పూజా సామగ్రి, వినాయకుల విగ్రహాలను కొనుగోలు చేశారు. పండుగ వాతావరణంతో వ్యాపారులు ధరలను పెంచారు. మట్టి విగ్రహాల అమ్మకాలు జోరుగా సాగాయి.





గురుకుల పాఠశాలల్లో సేవా కార్యక్రమాలు


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న బాలచంద్రన్

ఎడపల్లి(బోధన్): రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో రూ. కోటి వ్యయంతో వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాలచంద్రన్ తెలిపారు. ఎడపల్లి మండల కేంద్రంలోని గురుకుల బాలికల పాఠశాలలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సైన్స్ ల్యాబ్, గ్రంథాలయాల భవన నిర్మాణాలకు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు సేవా కార్యక్రమాలు, వ్యక్తి చైతన్యంపై అవగాహన కల్పించారు. దేశవ్యాప్తంగా అభయ ఫౌండేషన్ దాతల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని అన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుహాసిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

కామారెడ్డి టౌన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జిల్లా స్థాయి పోటీలను ఆదివారం నిర్వహించారు. పోటీల్లో ఎంపికైన విజేతలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఈనెల 21న వరంగల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. విద్యార్థులు కీర్తన, కావ్య, మౌనిక, నందిని, అశ్విత, హరిత, వైష్ణవి, అఖిల, కారుణ్య, శ్రావంతి, వైష్ణవి, సంజన, హారిక, లావణ్య, శ్రీనిధి ఎంపికైయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘గ్రేవ్‌యార్డ్‌కు భూములు ఇవ్వం’



నిరసన తెలుపుతున్న సర్పంచులు, కమిటీ సభ్యులు

డిచ్‌పల్లి: నడిపల్లి శివారులోని విక్టోరియా హాస్పిటల్ కాంపౌండ్ భూములను గ్రేవ్‌యార్డ్ (శ్మశానం)కు ఇవ్వడానికి ఒప్పుకునేది లేదని సీఎంసీ చర్చి సభ్యులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశుద్ధ స్థలాన్ని సంరక్షించాలని కోరుతూ కమిటీ సభ్యులు, క్రైస్తవులు ఆదివారం కాంపౌండ్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. దేవనగర్ సర్పంచ్ ఖతిజయూసుఫ్, దేవపల్లి సర్పంచ్ ఆనందమ్మ మాట్లాడుతూ.. మెదక్ సీఎస్ఐ చర్చి డయాసిస్ ఆధీనంలో ఉన్న విక్టోరియా భూములను నిరుపయోగం చేయడానికి సమాధులకు ఇవ్వడానికి అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. నడిపల్లి, దేవనగర్, దేవుపల్లి మూడు గ్రామాల పరిధిలో ఉన్న ఈ స్థలంలో తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నిజామాబాద్ సీఎస్ఐ సంఘం వారికి స్థలం కేటాయిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాందేవ్, కమిటీ మెంబర్లు బండి ప్రసాద్, జోసఫ్, ఎస్ఎస్ ప్రభాకర్, ఎంసాల్మన్‌రాజ్, అంబుజ పద్మారావు, సంపూర్ణ సుధాకర్, డేనియల్, రవికుమార్, ఇందిరా జేమ్స్, వరునిక తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలి


మాట్లాడుతున్న సీఐ

ఖలీల్‌వాడి: గణేశ్ నవ రాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలి పట్టణ సీఐ నరహరి అన్నారు. ఆదివారం పట్టణ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక మండపాల నిర్వాహకులు బాధ్యతాయుతంగా, తప్పనిసరిగా పోలీస్ శాఖ అనుమతి పొందాలన్నారు. మండపాల వద్ద అసాంఘిక కార్యకలాపాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై ఇప్పటికే నగరంలోని వినాయక మండప నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గణేశ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించే గణేశ్ మండలి వారు విధిగా పోలీస్ శాఖ రూపొందించిన https:// policeportal. tspolice. gov. in/ index. htm ఆన్‌లైన్ లింక్‌లో దరఖాస్తు చేసి అనుమతి పొందాలన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు స్పీకర్లను తక్కువ సౌండ్‌తో రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలన్నారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు సహకరించాలని కోరారు. మండపాల్లో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడినా వెంటనే డయల్ 100 కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు సంజీవ్, ప్రవీణ్, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు అందుకున్న సర్పంచ్


స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు అందుకుంటున్న రుద్రూర్ సర్పంచ్ చంద్రశేఖర్

రుద్రూర్: జీపీ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జిల్లా ఉత్తమ జీపీగా రుద్రూర్ ఎంపికైంది. జిల్లా సమీకృత కార్యాలయంలో ఈ అవార్డును మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్‌కు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, డీఆర్డీవో శ్రీచందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని గోపన్‌పల్లిలో శనివారం రాత్రి పేకాటస్థావరంపై దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై మురళి తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి వారి నుంచి రూ.28,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే పోలీసులకు సమాచారం అందించాలని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు.

ఘనంగా విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు

సుభాష్‌నగర్: నగరంలోని కలెక్టరేట్‌లో విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు–భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరై విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని వక్తలు అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, నగర మేయర్ దండు నీతూకిరణ్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ సత్యనారాయణ, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వర్, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, నుడా చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు రమేశ్, నర్సయ్య, అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రౌడీలకు ఇందూరు అడ్డా..

- గన్‌కల్చర్ ప్రమాదంలో నిజామాబాద్
- అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే శ్వేతపత్రం విడుదల చేయాలి
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ


మాట్లాడుతున్న ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: నిజామాబాద్ జిల్లా రౌడీలు, భూకబ్జాదారులకు అడ్డాగా మారిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్‌శాఖ విచ్చలవిడిగా గన్ లైసెన్సులు ఇస్తూ నగరాన్ని ప్రమాదంలో పడేసిందని, అసాంఘిక కార్యకలాపాలకు జిల్లా అడ్డాగా మారిందని అన్నారు. సీపీగా నాగరాజు పని చేసిన 18 నెలల్లో 70 తుపాకీ లైసెన్సులు ఇచ్చారని, వీటిని కేవలం భూకబ్జాదారులు, రియల్టర్లు, ఎమ్మెల్యే సన్నిహితులు, షాడో ఎమ్మెల్యేలు తీసుకున్నారని విమర్శించారు. హమాల్‌వాడీలో ఒకే ఇంటిపై ఆరు లైసెన్సులు పొందడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. ఒక్కో లైసెన్సుకు రూ.5లక్షల వరకు వసూలు చేశారని ఆరోపించారు. నిజామాబాద్‌కు రూ. వందల కోట్లు ఖర్చు చేశామంటున్న అర్బన్ ఎమ్మెల్యే.. అభివృద్ధి పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు. పోలీసులు ఏకపక్షంగా పని చేస్తున్నారని, బైక్ ర్యాలీని అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రేషన్‌కార్డులు, పింఛన్లు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇవ్వలేని నగరంలో గన్ లైసెన్సులు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. శాంతిభద్రతలు కాపాడలేని అర్బన్ ఎమ్మెల్యే అసమర్థుడని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పంచరెడ్డి లింగం, నాయకులు, కార్పొరేటర్లు మాస్టర్ శంకర్, నారాయణ యాదవ్, ఎర్రం సుధీర్, సుక్క మధు, పంచరెడ్డి శ్రీధర్, కిశోర్, హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2000–2001 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో మహేందర్, ఆనంద్ కుమార్, పండరి గౌడ్, నవీన్‌గుప్తా, సుధాకర్‌గౌడ్, చిప్ప మధు, వెంకటేశ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి


ఉబ్బు సాయిలు (ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పంట రక్షణకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెకు ఓ రైతు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన నాగిరెడ్డిపేట మండలం ధర్మారెడ్డిలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఉబ్బు సాయిలు(48) శనివారంరాత్రి పొలం వద్ద బోరుమోటారు వేసేందుకు వెళ్లగా పంట రక్షణకు ఏర్పాటు చేసిన కంచె తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

డెంగీతో బాలుడు ..


ఆద్యంత్ (ఫైల్)

కామారెడ్డి టౌన్: డెంగీతో 11 నెలల బాలుడు మృతి చెందిన ఘటన రామారెడ్డి మండలం అన్నారం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అన్వేశ్, సౌందర్యల 11 నెలల కుమారుడు ఆద్యంత్ వారం రోజులుగా తీవ్ర జ్వరం బాధపడుతున్నాడు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. శనివారం రక్తఫలికలు పడిపోవడం, డెంగీ ఉందని నిర్ధారించి హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. ఆసుపత్రిలో బాలుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. తమ బాబు బాగానే ఉన్నాడని చెప్పి వైద్యం అందించకుండా వైద్యులు నిర్లక్ష్యం చేశారని తల్లిదండ్రులు ఆరోపించారు. ఆసుపత్రిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఒకరి ఆత్మహత్య

కామారెడ్డి టౌన్: రామారెడ్డి బైపాస్ ప్రాంతంలో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలంలోని లక్కోరాకు చెందిన మహేందర్(40) స్వగ్రామంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహించేవాడు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన రెగ్యులరైజ్, బదిలీ ప్రక్రియలో సూర్యాపేట జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆదివారం రామారెడ్డిలోని ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకోగా మహేందర్ మృతదేహంగా గుర్తించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బెల్ట్ షాప్ సీజ్


మద్యం స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కాస్‌బాగ్ తండాలో అక్రమంగా కొనసాగుతున్న బెల్ట్ షాప్‌పై పోలీసులు ఆదివారం దాడి చేశారు. రూ.30వేల మద్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై ఎల్ రాము తెలిపారు. ఇంటి యజమాని బాదావత్ మోహన్, మద్యం విక్రయిస్తున్న రాజును పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. మండలంలో ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. బెల్ట్ షాపులకు ఎక్కడా అనుమతులు లేవని, ఫిర్యాదులు వస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట ఏఎస్సై దయాళ్‌సింగ్, సిబ్బంది ఉన్నారు.